

అయినా...
మనిషి మారలేదు...

పి. విజయ్‌సింహా

"ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్..." అదేపనిగా ఫోన్ మోగుతూండడంతో చిరాకుతో ఒంటి మీద నుంచి దుప్పటి తొలగించి, ఫోన్ అందుకుని విసుగ్గా "హలో!..." అన్నాడు సురేష్.

"నేన్రా... అమెరికా నుంచి దివాకరం మామయ్యను మాట్లాడుతున్నాను" అంది అవతలివైపు గొంతు.

ఆ మాటకు ఎటెన్షన్‌లోకి వచ్చి "ఆ... చెప్పండి మామయ్యా... ఏంటీ విశేషాలు" అన్నాడు సురేష్.

"ఏం లేదురా సీతమ్మధారలో శివలింగం వెలసిందట కదా... దాని గురించి వివరాలు తెలుసుకుందామని ఫోన్ చేసాను" అన్నాడు దివాకరం.

"ఏంటీ సీతమ్మధారలో లింగం వెలసిందా? ఎప్పుడూ? నాకు తెలీదే...?"

"నీకు తెలియకపోవడమేంట్రా? 'సంచలనం' పత్రిక రిపోర్టర్‌వి".

"నిజంగా నాకు తెలీదు మామయ్యా..."

"బాగానే వుందిరా వరస... అమెరికాలో ఉండే నాకు తెలిసిన విషయం ఇండియాలో... అదీ విశాఖలో ఉన్న నీకు తెలియకపోవడమేంట్రా?"

"అదికాదు మామయ్యా!... నేను ఇప్పుడే నిద్రలేచాను అందుకని..., అదిసరేగానీ అసలే మైందో చెప్పండి" అన్నాడు ఉత్సుకతతో సురేష్.

"ఈరోజు ఉదయం ఆరుగంటల సమయంలో ఎవరో ఇంటికోసం పునాది తవ్విస్తూంటే 'శివలింగం' బయటపడిందట. యిక్కడ టి.వి. న్యూస్‌లో చెబుతున్నారు. అసలు విషయమేమిటో? నిన్నడిగి తెలుసుకుందామని ఫోన్ చేసాను".

"సరే మామయ్యా అన్ని విషయాలూ తెలుసుకుని ఫోన్ చేస్తాను" అంటూ రిసీవర్ పెట్టేసి, హాల్‌లో ఉన్న టి.వి. వైపు కదిలాడు సురేష్.

★ ★ ★



సమయం ఉదయం 10 గంటలు.


కొద్ది గంటల క్రితం వరకూ అదో ఖాళీ స్థలం. యిప్పుడు అది గొప్ప మహిమాన్విత స్థలంగా పేరుకెక్కింది. వేలాదిమంది భక్తులతో ఆ ప్రదేశం కిటకిటలాడుతోంది. దేశం నలుమూలలావున్న వివిధ రకాలైన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెందిన ప్రతినిధులందరూ అక్కడకు చేరుకున్నారు. కొన్ని టి.వి. చానల్స్ వాళ్ళు వేన్‌లపై పెద్ద పెద్ద డిష్‌లను పెట్టుకొని అక్కడ జరిగేదంతా లైవ్ టెలికాస్ట్ చేస్తున్నారు. అప్పుడే అక్కడ 'జాతీయ మహిమాన్విత శివలింగ శక్తిసేన' పేరుతో ఒక సంఘం ఏర్పాటయింది. సంఘం సభ్యులు తలచుట్టూ 'ఎన్.ఎమ్.ఎస్.ఎల్.ఎస్.సేన' అనే అక్షరాలు ఉన్న ఎరుపు రిబ్బన్‌ని ధరించి, బారులు తీరిన భక్తులను కంట్రోల్ చేస్తున్నారు. ప్రక్కనే పెద్ద టెంట్‌లో భక్తబృందం భజనలు చేస్తూ కీర్తనలు పాడుతున్నారు. యింకోవైపు వందలాదిమంది వేపరెమ్మలు పట్టుకొని వూగిపోతూ డప్పులదరువులకనువుగా అడుగులు వేస్తున్నారు.

పూజాసామగ్రి అమ్మే దుఖాణాలు లెక్కలేనన్ని అక్కడ వెలిసిపోయాయి. పూజా విధానం, దీక్షకు వేసుకొనే బట్టలు మొదలైన విశేషాలను తెలిపే సి.డి.లు, ఆడియోలు కూడా మార్కెట్‌లోకి వచ్చేసాయి. యింతలో ఎవరో లింగం పాలు తాగుతోందన్నారు. అంతే... క్షణాల్లో పదుల సంఖ్యలో పాలవ్యాన్లు అక్కడికి చేరుకున్నాయి.

ముక్తిపీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ లింగానందస్వామి వారు ప్రముఖ టి.వి. ఛానల్‌లో ఈ విషయమై ప్రస్తావిస్తూ... శివుడు కైలాసంలో రుద్రతాండవం చేస్తున్నప్పుడు అతని ముంజేతికి కంకణంలా ధరించిన రుద్రాక్షమాలలోని ఒకరుద్రాక్ష రాలి భూమిపై పడిందని, అది కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత వెలుగు చూస్తుందని, అది వెలుగు చూసిన కొద్ది సంవత్సరాలలోనే ఈ సృష్టి అంతమవుతుందని 'మహాశివపురాణం'లో రాసిఉందని, ఆనాడు రాలిన ఆ రుద్రాక్షే ఈ శివలింగమని, ఈ ఉపద్రవాన్ని ఆపడానికి సర్వమానవాళి యజ్ఞయాగాదులు చేయాలని చెప్పుకుపోతున్నారు. అక్రమకేసులో జైలుపాలైన ఓ స్వాములవారు జైలు నుంచి మరో టి.వి. ఛానల్‌కు ఇంటర్వ్యూనిస్తూ తనను అరెస్ట్ చేసినందుకు భగవంతుడు ఆగ్రహించి, అవతరించి ఆవేశంతో పాలు తాగుతున్నాడని సెలవిచ్చారు. భారతదేశంలో ఉన్న అన్ని పీఠాలకు, అందరు స్వాములకూ ఈ మెసేజ్‌లు వెళ్లిపోయాయి. వివిధ ప్రాంతాలకు వెళ్ళవలసిన కొన్ని రైళ్ళను, విమానాలనూ రద్దుచేసి విశాఖ వైపుకు మరలించారు. స్కూళ్ళకు, ఆఫీసులకూ సెలవులు ప్రకటించారు. చాలామంది ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారులు తమ వాహనాలకు 'మహిమాన్విత శివలింగం స్పెషల్' అనే పేరు తగిలించి డబ్బులు దండుకోవడం మొదలుపెట్టారు.

★ ★ ★

సవరయ్య రోజుకూలీ. రెండురోజుల నుంచి పని లేకపోవడంతో డబ్బులు లేక ఆకలితో ఉన్నాడు. దానికి జ్వరం తోడయింది. తమ జట్టుగాళ్ళంతా కొత్త అమాసని ఊళ్ళకు వెళ్ళిపోయారు. సవరయ్యకు నా అనేవాళ్ళు ఎవరూ లేకపోవడంతో ఎక్కడికీ వెళ్ళక ఒక్కడే ఉండిపోయాడు. ఈ మహానగరంలో ఇల్లు, వాకిలి అన్నవి లేవు సవరయ్యకు. యితనికనే కాదు వీళ్ళజట్టుగాళ్ళెవరికీ లేవు. ఎక్కడెక్కడో వున్న మారుమూల పల్లెల నుంచి పనికోసం పట్టణాలకు చేరుకుంటారు యిలాంటివారు.




ఉదయం ఎనిమిది గంటలకంతా నగరంలో ఉన్న ప్రధానకూడళ్ళ వద్ద వీరు నిలుచుంటారు. పనిచేయించుకోదలసిన వారు వీరిని తమతో తీసుకువెళ్ళి పనిచేయించుకొని సాయంత్రానికి కూలీ ముట్టచెబుతారు. ఆ వచ్చిన కూలీ డబ్బుతో నలుగురైదుగురు కలిసి ఆరోజు వండుకోవడానికి సరిపడా సరుకులు, బియ్యం వగైరా కొనుక్కుని, అక్కడక్కడా దొరికిన కర్రపుల్లలు, ఎండిన ఆకులు, కాగితాలు యిలామండే చెత్తా చెదారాలను మంటబెట్టి వంటచేసుకొంటారు. యింకొందరైతే చిన్న కాకా హోటల్స్‌కి పోయి తక్కువధర భోజనమో, రొట్టెలో తిని కడుపు నింపుకొంటారు. ఆ తర్వాత ఏ పేవ్‌మెంట్లపైనో... ఏ షాపు అరుగుపైనో పడుకుంటారు. సవరయ్య తన దగ్గర మిగిలిన ఒకే ఒక్క రూపాయితో హాఫ్ టీ తాగి తను పడుకునే పేవ్‌మెంట్ వైపు నడుస్తున్నాడు. ఎదురుగా స్కూటర్‌పై వస్తున్న ఓ ఆసామి సవరయ్య దగ్గరగా వచ్చి స్కూటర్‌ని ఆపుతూ "ఏమయ్యా పనివుంది చేస్తావా?" అని అడిగాడు. ఆమాటకు సవరయ్యకు ప్రాణం లేచొచ్చినట్టయింది. "ఆ సేత్తాను బాబు" అన్నాడు. "అయితే నాతోరా" అంటూ స్కూటర్ వెనుక సీటుపై సవరయ్యను కూర్చోబెట్టుకుని, ఓ ఖాళీ స్థలం వద్దకు తీసుకువెళ్ళాడు ఆ ఆసామి.

"ఇదిగో ఈ గీతలు చూసావా? యిక్కడి నుంచి యింతవరకూ నాలుగడుగుల లోతున తవ్వాలి" అని సున్నంతో వేసిన మార్కింగ్‌ని చూపించాడు ఆ ఆసామి.

"అలాగే బాబూ తవ్వుతాను"

"ఎంతివ్వమంటావు"

"రోజు కూలీ తొంభై" ఎన్ని రోజులైతే అన్ని తొంభైలు యిచ్చేయండి"

"అలాగేం వద్దుగానీ యిది మొత్తం తవ్వడానికి ఎంతివ్వాలో చెప్పు"

"ఐదొందలియ్యండి"

"ఐదొందలుకాదుగానీ, రెండొందలిస్తాను"

"మరీ బొత్తిగా మూడొందలు తగ్గించేసినారు... ఇనాగైతే సేయలేను బాబూ"

"సరే యింకెందుకుగానీ రెండూ ఏభై యిస్తాను మరి మాట్లాడకు" అంటూ బేరం తెంచేసాడు ఆసామి.

సవరయ్య మరోమాట అనేవాడోమోగానీ ఆకలి అతని నోరు మూయించేసింది.

"సరే బాబూ! గునపం, పార మీరే యివ్వాలి"

"అలాగే... యిస్తాను"

"బాబూ... అడ్డుమాన్సుగా ఏభైరూపాయలు యివ్వండి" ఆశగా అన్నాడు సవరయ్య.

"నీవెవరో నాకు తెలీదు. ఎలా యివ్వమంటావయ్యా! రేపు పనిలోకి వచ్చాక యిస్తాన్లే...!"

"సరే బాబూ రేపు ఉదయం ఆరోగంటకే పనికి వచ్చేస్తా"నంటూ కదిలాడు సవరయ్య.

సూర్యుడు పూర్తిగా రాకముందే పనిలోకి వచ్చాడు సవరయ్య.

ఇంటి యజమాని వద్దనుంచి పలుగు, పార తీసుకుని మార్క్ వేసినచోట తవ్వడం ప్రారంభించాడు. ఓ పావు గంట తర్వాత "ఠంగ్..." మంటూ గడ్డపారకు ఏదో అడ్డు తగిలింది. ఆ శబ్దం విన్న ఇంటి యజమాని దాని చుట్టూ నెమ్మదిగా తవ్వమన్నాడు. సవరయ్య చుట్టూ పారతో మట్టిని తొలగించడంతో గుండ్రని లింగం వంటి ఆకారం సగం బయటపడింది. సవరయ్యతో తవ్వడం ఆపించి, పరుగు పరుగున వెళ్ళి ఇంటి చుట్టుప్రక్కల వారికి... ఫోన్లద్వారా తనచుట్టాలకు, బంధువులకూ ఈ విషయాన్ని చేరవేసాడు ఇంటియజమాని.

ఈ వార్త వీరినుండి వారికి, వారి నుంచి వేరొకరికి... అలా దావానంలా ప్రపంచమంతా వ్యాపించింది. ఈ వార్త తెలిసిన జనం తండోప తండాలుగా అక్కడికి చేరుకోసాగారు. ముందుగా చేరుకున్న మీడియావారు సవరయ్యను ఇంటర్వ్యూ చేసారు. వారి తర్వాత వేరొకరు... ఆ తర్వాత యింకొకరు యిలా రకరకాల వారు గంటలకొలదీ ఎడతెరిపి లేకుండా సవరయ్యను ప్రశ్నలతో ముంచెత్తసాగారు. వారందరికీ సమాధానాలు చెబుతూండడం వలన నోరు పిడచగట్టుకుపోయింది సవరయ్యకు. అసలే నీరసం... దానికి తోడు జ్వరం. కొంతసేపు తెరలు తెరలుగా దగ్గి, సొమ్మసిల్లి పడిపోయాడు. అంతే... మరోవార్త గుప్పుమంది. సవరయ్య తవ్వేటప్పుడు గడ్డపారతో లింగం తలపైన గంటుపెట్టాడని, అందుకు ఆగ్రహించిన శివుడు సవరయ్యను మూగవానిగా మార్చి సొమ్మసిల్లేట్లు చేసాడని. ఆ వార్త అలా అలా ప్రాకి చివరికి శివలింగంపై పోసిన పాలు ఎరుపెక్కుతున్నాయనే వార్తగా వ్యాప్తి చెందింది. ఈ రెండో వార్త మొదటివార్తకు ఎలా జతయిందో ఎవరికీ తెలీదుగానీ వార్తమాత్రం అత్యంత వేగంగా అన్నిచోట్లకూ చేరిపోయింది. ఈ వార్త చూసేవారికంటే మోసేవారే ఎక్కువయ్యారు. అగ్నికి గాలితోడయినట్టుగా వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకుని చిరుజల్లు కురవడం ప్రారంభమయింది. జనంలో భయాందోళన మొదలైంది. అందరూ పెద్దగా గొంతెత్తుతూ "ఓం నమశ్శివాయ... ఓం నమశ్శివాయ... శంభోశంకర... హర... హర" అంటూ భక్తితో ఊగిపోతున్నారు. యింకొందరైతే మొక్కులు మొక్కుతూ... ముడుపులు కట్టడం మొదలుపెట్టారు. తండోపతండాలుగా భక్తులు పూజాసామగ్రితో అక్కడకు చేరుకొంటూనే ఉన్నారు. వీరిలో

గోవింద్ ఒకడు. గోవింద్‌కి చిన్న టిఫిన్ కొట్టు ఉంది. అతను గొప్ప ఆస్థికుడు. శివలింగం వెలసిన విషయం తెలిసిన వెంటనే ఎక్కడిపని అక్కడే వదలిపెట్టి పరుగు పరుగున పండ్లు, కాయలూ పట్టుకుని వరుసలో వచ్చి నిలుచు న్నాడు. తనవంతు రావడంతో కొబ్బరికాయను కొట్టి లింగానికి అభిషేకం చేస్తూ భక్తితో లింగం చుట్టూ చేతులతో స్పృశించాడు. చేతులకు రోజూ అలవాటుపడిన స్పర్శ ఏదో తగలడంతో మనసులో చిన్న అనుమానం మెదిలింది. మరో సారి తడిమి పరిశీలనగా చూసాడు. తనను కున్నది నిజమైంది. వెంటనే అతని పెదవులపై నవ్వు మెరిసింది. ఆ దరహాసాన్ని పెద్దది చేస్తూ "హహ్హాహ్హాహ్హా" అంటూ విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు. అతని చేష్టలకు చుట్టూ ఉన్న జనం వింతగా చూడసాగారు. గోవింద్ నెమ్మ దిగా నవ్వు ఆపుకుని, చుట్టూ ఉన్న వారితో "అయ్యా! ఒక్కసారి ఇటు చూడండి. మనం దరం అనుకున్నట్టుగా యిది శివలింగం కాదు. ఇది 'రుబ్బురోలు పొత్రం'. దీన్ని పరిశీలనగా చూస్తే మీకే తెలుస్తుంది" అన్నాడు. ఆ మాట లకు అక్కడ కలకలం మొదలైంది. ఆ రాయిని చాలామంది పరిశీలించారు. వారి అనుమానం బలపడడంతో యింకొంచెం తవ్వుదాం అన్నా రు. కొందరు యువకులు ముందుకొచ్చి బలం గా పట్టుకుని ఆ రాయిని కదిలించారు. మట్టి లోంచి రాయి వూడి బయటకు వచ్చింది. రాయి సగభాగం నున్నగా ఉంది. వెనుకవైపు చూడగా పిడికోసం చేసిన రంధ్రం కనిపించింది. అది చూసిన జనం ఇది 'పొత్రమే' అని నిర్ధారిం చారు. ఈ సంఘటనపై అందరూ చర్చిస్తూం డగా కుండబోతగా పెద్దవాన మొదలైంది. దాంతో క్షణాల్లో ఆ స్థలాన్ని వదలి ఎవరికి వారుగా నిష్క్రమించారు.

## బస్‌ని పట్టే బోను

అర్జంట్‌గా ఒక ఎలుకల బోను ఇవ్వం డి... మా ఊరెళ్లే బస్‌ని పట్టుకోవాలి... షాపులో ప్రవేశిస్తూ హడావిడిగా అడిగింది ఓ యువతి.

సారీ... మేడమ్... బస్సు పట్టేంత పెద్ద బోనులు మా వద్ద లేవు... చెప్పాడు షాపు యజమాని.

సాయంత్రం 6 గంటలు...

కొన్ని గంటల క్రితం ప్రపంచమంతా అక్క డే కనిపించింది. ఎందరెందరో తమ ఉనికిని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలు, హడా విడిలు వర్షంతో తుడిచిపెట్టుకుపోయాయి. యిప్పుడు అక్కడ నిర్మానుష్యం... నిశ్శబ్ధం రాజ్య మేలుతోంది. ఆ వాతావరణాన్ని చూసిన ఎవరి కైనా క్రితం జరిగిన విషయాలను చెబితే నమ్మ లేనంత ప్రశాంతంగా మారిపోయిందా ప్రదేశం.

కానీ... యిదంతా నిజమేనని చెప్పడానికి రెండు మూగసాక్ష్యాలు యింకా మిగిలే ఉన్నాయి.

అవి...

లింగంగా పూజలందుకున్న గుండ్రాయి పొత్రం...!

సవరయ్య శవం....!!

★ ★ ★

"బీప్... బీప్... బీప్..." ఆల్‌లైన్స్ ఆర్ బిజీ! యువిల్ ట్రై ఆఫ్టర్ సమ్‌టైం..." అమెరికా ఫోన్ ఎంగేజ్ రావడంతో రిసీవర్ పెట్టేసి, మం చంపై చేరబడుతూ కళ్ళుమూసుకున్నాడు రిపో ర్టర్ సురేష్.. రేపటి సంచలనవార్త యింకే మవుతుందోనని ఆలోచిస్తూ... ●